







రమ్యకృష్ణకు మొదటి బహుమతి అందజేస్తున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు తదితరులు



ఉమాదేవికి రెండో బహుమతి



సునీతకు మూడో బహుమతి



# రిపించిన ముగ్గులు



రంగులు పులుముకున్న జేఎన్‌టీయూ మైదానం

**ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన**

జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం రంగులమయమైంది. ముత్యాల ముగ్గులకు వేదికగా మారి మురిసిపోయింది. తెలుగింటి సంప్రదాయ కళను ప్రదర్శించేందుకు మహిళలు, యువతులు పోటీ పడ్డారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)కు విశేష స్పందన లభించింది. అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్ స్థానికంగా సహకారం అందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 105 మంది మహిళలు, యువతులు పోటీల్లో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులతో ఆకట్టుకున్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి, పాలిటెక్నిక్ కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ రాధిక న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

## విజేతలకు బహుమతులు

విజేతలకు నగదు బహుమతులను అతిథులు అందజేశారు. నలుగురికి ప్రోత్సాహక నగదు బహుమతులు, పోటీల్లో పాల్గొన్న, హాజరైనవారికి కానుకలను అందజేశారు. అనంతపురం వేణుగోపాల్‌నగర్‌కు చెందిన రమ్యకృష్ణ మొదటి బహుమతి రూ.6వేలు, కదిరికి చెందిన ఉమాదేవి ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, అనంతపురం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సునీత తృతీయ బహుమతిగా రూ.3 వేలు గెలుచుకున్నారు. చందన, ఉమామహేశ్వరి, స్వాతి, శ్రీలత ప్రోత్సాహక బహుమతులు రూ.వెయ్యి చొప్పున అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ మేనేజర్ సందీప, జేఎన్‌టీయూ వీసీ సతీమణి వైశాలి గోర్పడే (ఆర్అండ్‌డీ, జేఎన్‌టీయూ), ప్రొఫెసర్ కిరణ్మయి(డైరెక్టర్ ఆఫ్ అకడమిక్), ప్రొఫెసర్ పద్మ సువర్ణ(ఫారిన్ అఫైర్స్), వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ జోజిరెడ్డి, అర్బన్ బ్యాంక్ సీఈఓ విజయభాస్కర్, వైస్ చైర్మన్ గోల్డ్ బాషా, మాజీ మేనేజర్ వీజీ లోకనాథ్, డైరెక్టర్లు సుంకర రమేష్, కృష్ణకుమార్, భాస్కర్, వెంకటాద్రి, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు గోపాల్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి వెలుగు రామకృష్ణుడు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ నారాయణస్వామి నాయక్, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.





పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు





హాజరైన మహిళలు





తల్లికి తోడుగా తనయుడు



ముగ్గుల లోకంలో నిమగ్నం...





ఏ రంగు తీసుకుంటే మంచిది...

### సంప్రదాయాలను కొనసాగించాలి..

పట్టణాల్లో ఉండేవారే కాక పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చినవారు సైతం సంప్రదాయాలను మరిచే పరిస్థితి ఏర్పడింది. అపార్ట్‌మెంట్ కల్చర్ వల్ల ముగ్గుల ఆవశ్యకత తగ్గిపోతోంది. భోగి మంటలు వేసేవారూ తక్కువయ్యారు. ఇలాంటి తరుణంలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ వారు క్రమం తప్పకుండా ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండడం హర్షించదగ్గ విషయం. ఈ సందడి వాతావరణం చూస్తుంటే జిల్లాకు సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చేసిందన్న భావన కలుగుతోంది. పల్లెల్లో ప్రతి ఇంటి ముందు ముగ్గు వేసేవారు. ఊరంతా ముగ్గులు కనిపించేవి. పండుగలు వస్తే ముగ్గుల సందడి కనిపించేది. కులమతాలకు అతీతంగా వ్యవహరించేవారు. ఐక్యత చాటుకునేవారు. ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలి.

- జేఎల్ మురళీధర్, అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్

### అభినందనీయం..

సంక్రాంతి ముగ్గులు మన సంప్రదాయాలకు ప్రతిబింబాలు. జనం టీవీ, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్న ప్రస్తుత కాలంలోనూ యువతులు ముగ్గుల పట్ల ఆసక్తి కనబర్చడం శుభపరిణామం. అనాదిగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగిస్తూ ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయం. ఆంధ్రజ్యోతి వాస్తవాలను నిర్భయంగా రాసే పత్రిక. ఆ సంస్థ నిర్వహిస్తున్న పోటీలకు వర్సిటీ మైదానం వేదికవడం గర్వంగా ఉంది. ఇక్కడ పోటీలు నిర్వహించడంతో వర్సిటీ విద్యార్థినులు పాల్గొనే అవకాశం దక్కింది. - ప్రొఫెసర్ సుదర్శనరావు, జేఎన్‌టీయూ వీసీ

### రాష్ట్రస్థాయిలో విజయమే లక్ష్యం: రమ్యకృష్ణ, మొదటి బహుమతి

దాదాపు 12 సంవత్సరాలుగా జిల్లాలో ఎక్కడ ముగ్గుల పోటీలు జరిగినా పాల్గొంటున్నాను. గతంలోనూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నాను. మూడోసారి బహుమతిని అందుకోవడం ఆనందంగా ఉంది. గతంలో రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం లభించినా కుటుంబ పరిస్థితుల వల్ల వెళ్లలేకపోయాను. ఈసారి రాష్ట్రస్థాయి పోటీలకు ఆహ్వానం వస్తే కచ్చితంగా పాల్గొని బహుమతి అందుకోవాలని ఆశపడుతున్నా.

### ప్రతిసారీ గెలుస్తున్నా: ఉమాదేవి, ద్వితీయ బహుమతి

చిన్నపుడు తోటివారితో కలిసి కాలక్షేపానికి ముగ్గుల పోటీల్లో పాల్గొనేదాన్ని. ముగ్గుల సంప్రదాయం వెనుక అంతరార్థం తెలుసుకున్నా. పలు పోటీల్లో ఉత్తమ ముగ్గులు వేసి బహుమతులు అందుకున్నా. దీంతో ముగ్గుల పట్ల ఆసక్తి పెరిగింది. సంక్రాంతి సీజన్ ఎపుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటాను. ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీల్లో ప్రతి ఏడాదీ ఏదో ఒక బహుమతిని గెలుస్తున్నాను.

### మొదటి బహుమతి కోసం ప్రయత్నిస్తా: సునీత, తృతీయ బహుమతి

ఆరు సంవత్సరాలుగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వారి ముత్యాల ముగ్గుల పోటీలో తృతీయ బహుమతిని అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ ఆరేళ్లలో మూడుసార్లు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో తృతీయ బహుమతిని గెలుపొందాను. వచ్చే ఏడాది మొదటి బహుమతిని గెలిచేందుకు ప్రయత్నిస్తా.




## ఎక్కడికెళ్లావే.. దున్నపోతా..!

కూడేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): దేవర దున్నపోతు వివాదం పోలీసులు, వైద్యాధికారుల వద్దకు వెళ్లింది. ఉన్న ఒక్క దున్నపోతు ఎవరిదన్నది దాని వయసును బట్టి తేల్చాలని నిర్ణయించారు. దీంతో కడదరకుంట, ముద్దలాపురం గ్రామస్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కూడేరు మండలంలోని ఈ రెండు గ్రామాల మధ్య దున్నపోతు వివాదం తలెత్తింది. కడదరకుంటలో నెలన్నర క్రితం బొడ్రాయి ప్రతిష్ఠ జరిగింది. ముద్దలాపురంలో రెండు నెలల క్రితం ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కడదరకుంటలో ఈ నెల 20, 21 తేదీలు, ముద్దలాపురంలో 21, 22 తేదీల్లో ఊరు దేవర నిర్వహించాలని గ్రామస్థులు నిర్ణయించారు. దేవతల కోసం రెండు గ్రామాల ప్రజలు ఒక్కొక్క దున్నపోతును వదిలారు. అందులో ఒకటి మాయమైంది. ఉన్న ఒక్క దున్నపోతు తమదేనని కడదరకుంట గ్రామస్థులు బంధించారు. అది తమ దున్నపోతు అని ముద్దలాపురం గ్రామస్థులు అంటున్నారు. వివాదం తలెత్తడంతో రెండూళ్ల ప్రజలు కూడేరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో దున్నపోతు వయసును నిర్ధారించి, నివేదిక ఇవ్వాలని పశు వైద్యాధికారులను కోరామని సీఐ రాజు తెలిపారు. నివేదిక రాగానే ఉన్న ఒక్క దున్నపోతు ఏ ఊరితో తేల్చి, వివాదాన్ని పరిష్కరిస్తామని తెలిపారు. మాయమైన దున్నపోతు ఏమైందో తెలియడం లేదని, అది దొరికితే సమస్య తేలికగా పరిష్కారమౌతుందని జనం అంటున్నారు.



ఈ దున్నపోతుపైనే వివాదం..

# కడుపు నిండేలా...!

## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

### డొక్కా సీతమ్మ పేరుతో పథకం ప్రారంభం

### 43 కళాశాలలు, మోడల్ స్కూళ్లలో అమలు

అనంతపురం విద్య/నార్పల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఇంటర్ విద్యార్థులకు కడుపు నిండుతోంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం భోజనం అందించారు. కలెక్టర్ వినోద్ కుమార్ నార్పల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఎండీఎం నాణ్యతపై ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే ప్రతి విద్యార్థి ఏదైనా సాధించగలరని అన్నారు. విద్యార్థులందరూ ఏకాగ్రతతో చదవాలన్నారు. అప్పుడే ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారని అన్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేఎస్ఆర్ స్కూల్ న్యూటౌన్ బాయ్స్ జూనియర్ కళాశాలలో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా విద్యార్థులకు సకాలంలో భోజనం అందడం వల్ల ఆరోగ్యంతో పాటు చదువుపై శ్రద్ధ కూడా పెరుగుతుందన్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు గుత్తిలోని గర్ల్స్ కాలేజ్‌లో జరిగిన వేడుకలో పాల్గొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు స్థానికంగా జరిగిన జూనియర్ కళాశాలల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### 43 విద్యాసంస్థల్లో...

జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులు చదువుతున్న 43 విద్యాసంస్థల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత జూనియర్ కళాశాల్లో భోజనం అందించాలని భావించారు. తర్వాత మోడల్ స్కూళ్లలో నిర్వహించాలంటూ ఆదేశాలు రావడంతో వాటిలో కూడా ప్రారంభించారు. జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 7759 మందికి భోజనం అందించారు. అదేవిధంగా 15 మోడల్ స్కూళ్లలో 791 మంది విద్యార్థులకు, 5 హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో 23 మందికి మధ్యాహ్న భోజనం శనివారం అందించారు.



న్యూటౌన్ కాలేజీలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

## రేపటి నుంచి బోగస్ పింఛన్ల వేట


అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగుల కోటా కింద పింఛన్లు పొందుతున్నవారిని గుర్తించేందుకు సోమవారం నుంచి రీ వెరిఫికేషన్ నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జిల్లాలో మంచానికి పరిమితమైన దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు 2,499 మంది ప్రతి నెలా రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్నారని తెలిపారు. వీరిలో నకిలీలు ఉన్నారనే ఆరోపణలు రావడంతో సీఎం చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారని అన్నారు. నకిలీలను తొలగించి, అర్హులకు మాత్రమే పింఛన్లు ఇచ్చేందుకు జిల్లాలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ధ్రువపత్రాలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రత్యేక వైద్యం బృందం లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళుతుందని, సహకరించాలని కోరారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## కాంట్రాక్టర్ ఆత్మహత్య

**రూ.6కోట్ల బిల్లులు పెండింగ్.. రూ.4.5కోట్ల అప్పులతో దిగులు**

**బ్యాంకులో ఓడీ అకౌంట్ రెన్యువల్ చేయలేదని మనస్తాపం**

అనంతపురం క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ జనార్దన్‌రెడ్డి(50) విష ద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు నగరంలోని ద్వారకానగర్‌లో జనార్దన్‌రెడ్డి తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. జేబీఆర్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో గత 12 సంవత్సరాలుగా కాంట్రాక్టు పనులు చేస్తున్నారు. కొన్నాళ్ల కిందట ఆర్‌డబ్ల్యుఎస్, ఏపీఐఐసీ శాఖల పరిధిలో శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం, ధర్మవరం, నంద్యాల జిల్లా గుమ్మడాపురం, డోన్, రాజంపేట జిల్లా ఊటకూరులలో పలు పనులు చేశారు. మొత్తం రూ.6కోట్ల పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులు రావాల్సి ఉంది. పనుల కోసం తెలిసిన వారి వద్ద రూ.4.5కోట్లు అప్పులు చేశాడు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. అలాగే ఆర్ఎఫ్ రోడ్డులోని కర్ణాటక బ్యాంకులో ఓడీ అకౌంట్, బ్యాంక్ గ్యారెంటీలను అధికారులు రెన్యువల్ చేయలేదని కుటుంబసభ్యులతో చెప్పి బాధపడేవాడు. ఈ క్రమంలోనే మూడో తేదీ మరోసారి బ్యాంకు వద్దకెళ్లాడు. రెన్యువల్ చేయమని కోరగా డబ్బు చెల్లిస్తేనే రెన్యువల్ చేస్తామని బ్యాంకు అధికారులు ఖరాకండిగా చెప్పారు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. కొంతసేపటికే శ్రీనగర్‌కాలనీలోని అయ్యప్పస్వామి గుడి సమీపానికి వెళ్లాడు. ఓ పక్కకు కారు ఆపి విష ద్రావకం తాగాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితుడు మంజు అపస్మారక స్థితిలో ఉన్న అతడిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ప్రసన్నలక్ష్మి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



జనార్దన్‌రెడ్డి (ఫైల్)

# నమో వాయుపుత్రా..!

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

హనుమన్నామస్మరణతో మార్మోగిన అనంత

హాజరైన హంపి, మంత్రాలయ పీఠాధిపతులు




అనుగ్రహభాషణం చేస్తున్న మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి





హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న సంధ్యామూర్తి బృందం




హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న విద్యార్థులు



జై హనుమాన్..





అనంతపురం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏక కాలంలో 20వేల గొంతుకలు హనుమన్నామస్మరణ చేయడంతో అనంత నగరం భక్తిభావంతో పులకించింది. హనుమాన్ చాలీసా పారాయణ ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. దాదాపు 150 ఆలయాల ప్రతినిధులు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు, జిల్లాలోని దాదాపు 60 పాఠశాలల విద్యార్థులు దాదాపు 20వేల మందితో ఆర్ట్స్ కళాశాల మైదానం కిక్కిరిసిపోయింది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామి జ్యోతి ప్రజ్వలన చేశారు. రాజమహేంద్రవరం కమాండెంట్ ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు దంపతులు దాదాపు రెండున్నర నిమిషాల పాటు నిర్విరామంగా శంఖం పూరించి హనుమాన్ చాలీసా పారాయణ ప్రారంభించారు. తొలుత నృత్యకళాకారులు హనుమాన్ చాలీసా సంగీతానికి శాస్త్రీయ నృత్యం చేస్తూ అలరించారు. అనంతరం సంగీత విద్వాంసురాలు సంధ్యామూర్తి బృందం హనుమాన్ చాలీసా పఠించగా వీరితోపాటు విద్యార్థులంతా సామూహికంగా చాలీసా పారాయణం చేశారు. తదనంతరం మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామి హాజరై అనుగ్రహభాషణం చేశారు. భక్తితత్వం, విశ్వాసం అంటే ఏమిటో హనుమంతుడు లోకానికి చాటిచెప్పారన్నారు. ఆయన చూపిన భక్తిభావాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. మరో పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి అనుగ్రహభాషణం చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణం మానసిక ప్రశాంతతో పాటు మనోధైర్యాన్ని ఇస్తుందన్నారు. భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ గంగాధరశాస్త్రి మాట్లాడుతూ హనుమంతుడి జీవితగాథను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మనలో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపే ప్రతిఒక్కరూ హనుమంతులేనని ఉపదేశించారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మొమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ శ్యామ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, సుంకు వేణుగోపాల్, ఆకుల రాఘవేంద్ర, ఎమరాల్డ్ రమణ, టీచర్ ప్రసాద్, సత్యనారాయణ, కామర్స్ రఘు, మురళి, రవి, హర్షద్ జైన్, న్యాయవాది గురుప్రసాద్, శ్రీపాద వేణు పాల్గొన్నారు.

## అంధులకు ఆదర్శం బ్రెయిలీ జీవితం



అంధులకు సెర్చ్ స్టిక్స్ అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లూయీ బ్రెయిలీ జీవితం, లిపి అంధులకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. లూయిస్‌బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని జాతీయ అంధుల క్రీడా సమాఖ్య ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా స్థానిక కృష్ణకళామందిరంలో నిర్వహిస్తున్న అంధుల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంధులను ప్రోత్సహించి, అందరితో సమానంగా చూడాలని కోరారు. లూయిస్‌బ్రెయిలీ స్ఫూర్తితో అంధులు వివిధ రంగాల్లో రాణిస్తుండటం అభినందనయమన్నారు. అంధుల ప్రతిభకు పదునుపెట్టే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ ఖుష్బూకొఠారి, అంధుల క్రీడాసమాఖ్య సభ్యులు విజయభాస్కర్, రవి, నాగశివారెడ్డి, నాగార్జున, ఎర్రిస్వామి, కుమార్ రాజా, అంధ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అండర్-17 జాతీయస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 12 జట్లు, 216మంది క్రీడాకారిణులు భాగస్వాములైన 4వ ఇన్‌స్పైర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను అనంత క్రీడా గ్రామంలో నిర్వహిస్తున్నారు. 8రోజుల పాటు సాగే టోర్నీని ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో కంపాసిజన్-గోవా, పెన్నా-ఏపీ, నర్మదావ్యాలీ-మధ్యప్రదేశ్, థామ్-తమిళనాడు, లైఫ్‌స్పోర్ట్స్-తమిళనాడు, నందిఫౌండేషన్-గుజరాత్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్-గుజరాత్, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆంధ్రప్రదేశ్), స్పోర్ట్స్‌ప్లస్ ఫుట్‌బాల్ అకాడమీ-తమిళనాడు, ఫాల్కన్‌గర్ల్స్-ఒడిశా, లిబర్టీ లేడీస్-తమిళనాడు, బెంగళూరు జట్లు తలపడనున్నాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారిణులలో దాగి ఉన్న క్రీడానైపుణ్యతను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవకాశం కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తు న్నామని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అనంతస్పోర్ట్స్ అకాడమీ-ఆంధ్రా జట్టుపై నర్మదావ్యాలీ 3గోల్స్ తేడాతో, ఒడిశాపై గుజరాత్ 6 గోల్స్, గుజరాత్‌పై బెంగళూరు 17గోల్స్ తమిళనాడుపై పెన్నా-ఏపీ ఒక గోల్, తమిళనాడుపై కంపాసిజన్ 18గోల్స్, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ 10గోల్స్ తేడాతో విజయం సాధించాయి.



ఏఎస్ఏ, నర్మదావ్యాలీ జట్ల మధ్య మ్యాచ్

## అంధుల క్రికెట్ పోటీల విజేత తిరుపతి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విశాఖపట్నంపై తిరుపతి జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కల్యాణమండపంలో శనివారం లూయీ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌రెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, లేడీస్‌క్లబ్ సభ్యురాలు శ్రీదేవి, వైద్యులు భవాని, పీఓసీ రమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సాజియతీ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళా క్యాలెండర్ విడుదల



జాబ్‌మేళా క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

అనంతపురం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెలలో నిర్వహించనున్న జాబ్ మేళాలకు సంబంధించిన క్యాలెండర్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం విడుదల చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెలా నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను అందించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తుంద న్నారు. ఈనెల 10న రాయదుర్గం నియోజకవర్గంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, శింగనమల నియోజకవర్గంలోని నార్పల పాల్‌టెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. 18న రాప్తాడు నియోజకవర్గం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల, కళ్యాణదుర్గం నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా ఉంటాయన్నారు. వివరాలకు 8317520929, 8554281026 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ జిల్లానైపుణ్యాభివృద్ధి అధికారి జగన్‌యాదవ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.

## ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేత అనంత



విజేత అనంత, రన్నరప్ న్యూజిల్యాండ్ హట్‌హాక్స్ జట్లు

అనంతపురం క్లాక్ టవర్, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి): ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేతగా అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిలిచింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శనివారం ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ ఫైనల్ పోటీని హట్‌హాక్స్ న్యూజిల్యాండ్, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్ల మధ్య నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 161పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన న్యూజిల్యాండ్ హట్ హాక్స్ జట్టు 20ఓవర్లలో 3వికెట్లు నష్టానికి 139 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం ఫ్రెండ్‌షిప్ సిరీస్‌లో క్రీడాకారులకు ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పిన ఇంగ్లాండ్ క్రికెటర్ హసీబ్‌హమీద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రెటరీ భీమలింగారెడ్డి, వెటరన్ క్రికెటర్ నాగప్పా, కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ హబీబ్, న్యూజిల్యాండ్ మాజీ క్రికెటర్ బ్రూస్ ఎడ్గర్, న్యూజిల్యాండ్ హట్‌హాక్స్ ఛైర్మన్ రవి కృష్ణమూర్తి, మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్, కోచ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల కాలపరిమితిని మరో రెండు నెలలు పొడిగించినట్లు జిల్లా సమాచారశాఖ డీఐపీఆర్వో గురుస్వామిశెట్టి శనివారం ఓప్రకటనలో తెలిపారు. గత డిసెంబరు 31నాటికి అక్రిడిటేషన్ కలిగి, ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలిస్టులకు మాత్రమే ఈఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల వరకు పొడిగింపు సౌకర్యం ఉంటుందన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యాలు ప్రస్తుతం పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలను తమకు పంపాలన్నారు.

### సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు: డీఎంఓ

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని సబ్‌యూనిట్ ఆఫీసర్లకు జిల్లా మలేరియా నివారణాధికారి (డీఎంఓ) డాక్టరు ఓబులు ఆదేశించారు. జిల్లాకార్యాలయంలో శనివారం ఆయన సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఓ మాట్లాడుతూ సబ్‌యూనిట్ ఆఫీసర్లు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, ఆరోగ్యసిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. కొందరు సబ్‌యూనిట్ ఆఫీసర్లు సరిగా విధులకు వెళ్లడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఫార్మసిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కడపజోన్-4 పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో 15 ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి శనివారం ఓప్రకటనలో వెల్లడించారు. ఈనెల 17 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈనెల 5 ఆదివారం, 12నుంచి 15వరకు సంక్రాంతి సెలవులు నేపథ్యంలో ఆరోజుల్లో దరఖాస్తులు స్వీకరించమన్నారు. పోస్టులకు సంబంధించిన దరఖాస్తు నమూనా, ఇతర వివరాలు http:-cfw. ap. gov. in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, కడపకు పంపాలన్నారు.

### చిట్టీల పేరుతో రూ. రెండు కోట్లకు టోకరా..?

గుత్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో టోకరా వేసి ఉడాయించడంతో బాధితులు శనివారం రాత్రి స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వివరాల మేరకు.. మున్సిపల్ పరిధిలోని సూరశింగనపల్లికి చెందిన అంజలీదేవి, పురుషోత్తం దంపతులు. అంజలీదేవి ఇంట్లో చీరల వ్యాపారం చేస్తూ, చిట్టీలు కూడా నిర్వహించేవారు. ఈమె గత పదేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తున్నారన్నారు. అయితే దాదాపు రూ2కోట్ల మేరకు చిట్టీల డబ్బులు చెల్లించకుండా భర్తతో కలిసి నెలన్నర కిందట ఎక్కడికో వెళ్లిపోయారని బాధితులు స్థానిక ఎస్ఐ సురేష్‌కు తెలిపారు. కాగా శనివారం రాత్రి అంజలీదేవి తల్లిదండ్రులు ఇంటి తలుపులు తెరవడంతో సామగ్రిని తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న బాధితులు అక్కడికి వచ్చి, వారితో గొడవకు దిగారు. అనంతరం బాధితులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి, న్యాయం చేయాలని ఎస్ఐను కోరారు. బాధితులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వారికి తెలిపారు.

# కర్షకుల కష్టాలు..!

## పొలాల్లో వరుస చోరీలు

- ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
- రాగివైరు ఎత్తుకెళ్తున్న దొంగలు
- ఇబ్బంది పడుతున్న రైతులు

కళ్యాణదుర్గం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల పొలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైరు చోరీ చేసే సంఘటనలు పెరిగిపోయాయి. దీంతో సాగునీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంటకు అడవి జంతువుల నుంచి కాపలా కాసే పరిస్థితుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా కాపలా ఉండాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.



తన పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరును ఎత్తుకెళ్లినట్లు చూపిస్తున్న రైతు పవన్ (ఫైల్)

### ఎడాపెడా చోరీలు..

గత ఏడాది ఏప్రిల్ 30న కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో సబ్ మెర్సిబుల్ మోటారును దుండగులు ఎత్తుకెళ్లారు. ఇదే నెలలో బోరంపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి రాగి వైరును చోరీ చేశారు. యర్రంపల్లికి చెందిన ఓ రైతు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, రాగి వైరును ఎత్తుకెళ్లారు. దురదకుంట, భట్టువానిపల్లి గ్రామాల్లో కూడా రెండు చోట్ల దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి రాగి వైరు ఎత్తుకెళ్లారు. కంబదూరు మండలంలోని కుర్లపల్లిలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగుల కొట్టి, రాగి వైరును ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లారు. ఓబయ్యతోట సమీపంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్‌ను అపహరించారు. తాజాగా జనవరి 1న అర్ధరాత్రి సమయంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి లే అవుట్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. అలాగే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు.



కళ్యాణదుర్గం మండలం భట్టువానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం (ఫైల్)

### రాగి వైరుకు డిమాండ్ ఉండటం వల్లే..

గతంలో డ్రిప్పులు, స్ప్రింక్లర్లను మాత్రమే దొంగలు ఎత్తుకెళ్లేవారు. అయితే రాగికి మార్కెట్‌లో మంచి డిమాండ్, విలువ ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై దృష్టి సారించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రాగి విలువ రూ. 900లు నుంచి రూ. 1000లు పలుకుతోంది. సాధారణంగా ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో 30 కిలోల నుంచి 40 కిలోల రాగి వైరు ఉంటుంది. ఒక కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తయారు చేయడానికి దాని సామర్థ్యాన్ని బట్టి రూ. 30 వేలు నుంచి రూ. 45 వేల వరకు ఖర్చు అవుతుంది. కానీ దొంగలు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి వైరును ఎత్తుకెళ్లి రూ. 12 వేలు నుంచి రూ. 15 వేలకే విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు రాగి వైరు లభిస్తుండటంతో కొనేవారు కూడా ఆసక్తి చూపుతున్నారు.

### కాపలా వెళ్తున్నాం



దొంగల తాకిడి ఎక్కువ కావడంతో రాత్రి పూట ట్రాన్స్‌ఫార్మర్లకు తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఉంటేనే కదా, మోటార్లు పని చేసి, తోటకు నీరు సరఫరా అయ్యేది. అదే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తే, మరలా కొత్తది తెచ్చి పెట్టుకోవాలంటే చాలా కష్టం అవుతోంది. అందుకనే ముందుజాగ్రత్తగా కాపలా వెళ్తున్నాం. పోలీసులు చర్యలు తీసుకుని చోరీలను అరికట్టాలి.

-రామాంజి, రైతు, మేళ్లకుంట

### ప్రత్యేక నిఘా వేశాం

ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం విషయం మా దృష్టికి వచ్చింది. ఈ చోరీలను అరికట్టడానికి ప్రత్యేక నిఘా వేశాం. దాంతో పాటు ప్రత్యేక పోలీస్ సిబ్బంది కూడా నియమించి వీటిని అరికట్టడానికి ప్రయత్నిస్తున్నాం.

- రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

### ఆర్థికంగా నష్టపోతాం



వేలాది రూపాయలు ఖర్చు చేసి, నానా అగచాట్లు పడి పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటున్నాం. దొంగలు మాత్రం ఉద్దర సొమ్ముకు కక్కుర్తిపడి వాటిని ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా బాగా నష్టపోతున్నాం. ఈ నష్టాన్ని భరించలేక ప్రతిరోజు రాత్రి పూట తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. అరకొరగా పండుతున్న పంటలతో ఇబ్బందులు పడుతున్న మాలాంటి రైతులకు ఈ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. -రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

## రేటెక్కువ.. వొద్దులేన్నా..!

### ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు దరఖాస్తులు నిల్

### షరతులతో ముందుకురాని వ్యాపారులు

అనంతపురం అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను ఏర్పాటు చేసేందుకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గత ఏడాది డిసెంబరు 17 నుంచే దరఖాస్తులను ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆహ్వానించారు. తొలుత డిసెంబరు నెలాఖరు దాకా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు రుసుం రూ.15 లక్షలుగా నిర్ణయించడంతో వ్యాపారులు ఈ ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు వైపు మొగ్గు చూపలేదు. ఒక్క దరఖాస్తు రాకపోవడంతో ఈనెల 7 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా దరఖాస్తులు వస్తాయో రావోనని సంబంధిత శాఖ అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

**దరఖాస్తు రుసుముతోనే వెనుకంజ**

జిల్లా కేంద్రానికి ఐదేళ్ల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేశారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలని నిర్ణయించారు. రెండో సంవత్సరం 10 శాతం పెంచుతామన్నారు. ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం కనీసం 4000 చదరపు అడుగుల వైశాల్యం ఉండాలని షరతు పెట్టారు. ఈ స్టోర్‌లో ఐఎంఎఫ్ఎల్ కనీస ధర రూ.1200, బీర్ ధర రూ.400పైన రేట్లు ఉండే స్టాక్ మాత్రమే విక్రయించాలనే నిబంధన విధించారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తు ను https//apsbcl.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులు బాటు కల్పించారు. అయితే దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు నిర్ణయించడం, అది నాన్ రీఫండబుల్ కావడంతో వ్యాపారులు దరఖాస్తు చేయడానికి జంకుతున్నట్లు సమాచారం.

**ఏడో తేదీ వరకు గడువు: రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అనంతపురం**

జిల్లాకేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తొలుత డిసెంబరు నెలాఖరు దాకా గడువు ఉండేది. దరఖాస్తులు రాకపోవడంతో ఈనెల ఏడో తేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు గడువును రాష్ట్ర ఉన్నతాధికారులు పొడిగించారు. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా సమర్పించాలి. దాఖలైన దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు పంపుతాం.

### నేడు ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

అనంతపురం విద్య, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 78వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు హాజరవుతారన్నారు.

క్రైం కార్నర్

## నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- పాక్షికంగా విరిగిన రైలు పట్టా
- గమనించిన కీమన్
- ఎర్రజెండాతో రైలుకు ఎదురెళ్లిన వైనం
- నిదానంగా దాటిన ఎక్స్‌ప్రెస్

ధర్మవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణీకులు, రైల్వే సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని తిప్పేపల్లి సమీపాన ఎల్‌సీ నంబరు 8 వద్ద రైలు పట్టా పాక్షికంగా విరిగిపోయింది. చలికాలం దృష్ట్యా సంకోశం చెందిన రైలుపట్టా కొంత మేర విరిగిపోయింది. విధి నిర్వహణలో ఉన్న కీమన్ బండి ప్రసాద్ దానిని గమనించారు. అప్పటికే నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు 120 కిలోమీటర్ల వేగంతో సమీపంలోకి వచ్చింది. ప్రమాదాన్ని తెలియజేస్తూ కీమన్ ఎర్రజెండాను ఊపుతూ రైలుకు ఎదురుగా వెళ్లారు. అతి వేగంతో వస్తున్న ఆ రైలు అప్పటికే పాక్షికంగా దెబ్బతిన్న ప్రాంతాన్ని దాటుకుని రెండు బోగీలు ముందుకెళ్లాయి. అదే రైలులో ప్రయాణిస్తున్న ఇంజనీరింగ్ అధికారుల సూచనతో నిదానంగా నడుపుకుంటూ ధర్మవరం స్టేషన్‌కు చేర్చారు. అదే వేగంతో మరిన్ని బోగీలు వెళ్లి ఉండుంటే ప్రమాదం సంభవించేదని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. శీతాకాలంలో రైలుపట్టాలు సంకోచించడం వల్ల పగుళ్లు వస్తాయని రైల్వే ఇంజనీర్లు పేర్కొన్నారు. రైలు వెళ్లిన అనంతరం అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, మరమ్మతులు చేపట్టారు. కీమన్ బండి ప్రసాద్‌ను ప్రయాణీకులు, రైల్వే అధికారులు అభినందించారు.

## తల్లి, కుమారై అదృశ్యంపై కేసు నమోదు


కాయల రోజా


భవిష్య

గాండ్లపెంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తల్లి, కుమారై అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామమోహన్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కదిరి మండలంలోని కుమ్మవాండ్లపల్లికి చెందిన కాయల రోజా గాండ్లపెంట మండలం కటారుపల్లి రైతు భరోసా కేంద్రంలో ఎంపీఈఓగా పనిచేస్తున్నారు. ఈనెల 3వ తేదీన కుమార్తె భవిష్యతోపాటు రోజాను ఆమె భర్త శ్రీనివాసులు రైతు భరోసా కేంద్రంలో విధులకు వదిలి పెట్టి వచ్చాడు. అప్పట్నుంచి ఇరువురు కనిపించట్లేదని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామమోహన్ తెలిపారు.

## ఆలయాల్లో చోరీ

శింగనమల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గాంజనేయ స్వామి కొండ మీద ఉన్న ఆలయాల్లో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఐదు కిలోల వెండి, అమ్మవారి పంచలోహ విగ్రహం చోరీ అయ్యాయి. కొండమీద దుర్గాంజనేయస్వామి, సిరి దుర్గమ్మ దేవాలయాలు ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో ఆలయాలు తాళాలు ధ్వంసం చేశారు. అనంతరం ఆలయాల్లోకి చొరబడి దుర్గాంజనేయస్వామి విగ్రహం మీద ఉన్న వెండి కౌశం, కిరీటం, సిరి దుర్గమ్మ అమ్మవారి విగ్రహం మీద ఉన్న వెండి, బంగారం గిన్నె బొట్టుతోపాటు అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. అర్చకులు ఫిర్యాదు మేరకు సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ విజయకుమార్ సిబ్బందితో సంఘటన్నా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## విద్యార్థిని ఆత్మహత్య

రాయదుర్గం రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి సావిత్రమ్మల కుమార్తె భారతి(18) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భారతి బళ్లారిలోని ఎస్‌జీటీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఈమెకు చదువు పట్ల ఆసక్తి లేకపోవడం, తల్లిదండ్రులు మాత్రం బాగా చదువుకోవాలని చెబుతుండటంతో మన స్తాపం చెందింది. ఈక్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జయనాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## వదాన్య సొసైటీ సేవలు అమోఘం

- హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ
- సొసైటీకి రూ.లక్ష చెక్కు అందజేత


ఎమ్మెల్యే బాలకృష్ణ నుంచి చెక్కు అందుకుంటున్న వదాన్య సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి

కొత్తచెరువు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురంజిల్లాలో విద్యాభివృద్ధికి వదాన్య సొసైటీ చేస్తున్న సేవలు అమోఘమని హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలకృష్ణ కొనియాడారని సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి తెలిపారు. నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న వదాన్య సొసైటీని సినీ హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. రూ. చెక్కును అందించినట్లు అశోక్ తెలిపారు. ఆ మొత్తాన్ని ఇటీవల నిర్వహించిన టాలెంట్, ఎస్టీటీ టెస్టుల విజేతలకు అందించనున్నట్టు అశోక్ పడపాటి వివరించారు.

# అద్దె భవనాల్లో.. అగచాట్లు..!

- శిథిలావస్థలో అంగన్‌వాడీ సెంటర్లు
- ఇబ్బందిపడుతున్న చిన్నారులు, గర్భిణులు
- అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు


రంగచేడులో అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

గుమ్మఘట్ట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను అద్దె భవనాల్లో నడుపుతున్నారు. దీంతో సిబ్బందితో పాటు చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె గదులు ఇరుగ్గా ఉండటం, గాలి, వెలుతురు సరిగా ఉండకపోవడంతో తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. గదిలో స్థలం చాలక మధ్యాహ్న భోజనం తినడానికి వచ్చే గర్భిణులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఈ ఇబ్బందులను తొలగించడానికి, సొంత భవనాలు నిర్మించడానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో ప్రారంభించిన పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

### సగం కేంద్రాలకే సొంత భవనాలు

మండలంలో 67 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 31 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 25 కేంద్రాలను అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 11 ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో అద్దె లేకుండా నడుపుతున్నారు. మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పొందుతున్న చిన్నారులు 2401, బాలికలు 2374, గర్భవతులు 562, బాలింతలు 629 మంది ఉన్నారు. వీరందరికీ ఆయా గ్రామాల్లో సరైన కేంద్రం లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో నాడు- నేడు కింద అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ఒక్కో కేంద్రానికి రూ. ఏడు లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. రంగచేడు, ఎస్ హొసళ్లి, అడిగుప్ప, పైదొడ్డి, ఆర్.కొత్తపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా అర్ధంతరంగా నిలిచిపోయిన వాటిలో ఉన్నాయి. గత టీడీపీ పాలనలో ఉపాధిహామీ పథకం నిధులతో ప్రారంభించిన జే వెంకటంపల్లి, నేత్రపల్లి గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలు మధ్యలోనే ఆగిపోయాయి. వీటిని సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బీటీపీలో అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ కేంద్రం

### నాడు - నేడు నిధులు దుర్వినియోగం



గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు - నేడు పథకం కింద నిధులు మంజూరు చేశారు. అయితే వాటిని సక్రమంగా వినియోగించుకోకుండా వైసీపీ నాయకులు దుర్వినియోగం చేశారు. దీంతో అన్నిచోట్లా అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు ఆగిపోయాయి. బీటీపీలో ఆగిన అంగన్‌వాడీ భవనమే ఇందుకు నిదర్శనం. **- బసవరాజు, బీటీ ప్రాజెక్టు**

### నిధులు మంజూరు చేయాలి: రామప్ప, తాళ్లకెర



మండలంలో అంగన్‌వాడీకి భవనాలు లేక చిన్నారులకు అద్దెభవనాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు చేసి పక్కాభవనాలు నిర్మించాలి.

### ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి - రామాంజనేయులు, గుమ్మఘట్ట



ప్రభుత్వం చిన్నారుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ అవసరమైన భవనాలు నిర్మించుకోకపోవడం దారుణం. అద్దె భవనాల్లో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం శ్రద్ధచూపి పక్కా భవనాలు వెంటనే నిర్మించాలి.

### ప్రతిపాదనలు పంపాం: పద్మావతి, సీడీపీఓ



మండలంలో పక్కాభవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాం. అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అర్ధంతరంగా ఆగిన భవనాల న్నింటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం అధికారులకు నివేదికలు పంపాం. చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

## లింగ నిర్ధారణ చేస్తే జైలుకే

- స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టండి
- కలెక్టరు వినోద్‌కుమార్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చట్ట విరుద్ధంగా గర్భస్థ లింగ నిర్ధారణ చేసేవారిని జైలుకు పంపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. లింగనిర్ధారణ నిషేధిత చట్టం అమలుపై కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ నివారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. తొలుత ఈచట్టంపై అవగాహన పెంచడానికి విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. స్కానింగ్‌చేసి, ఆడపిల్ల ఉంటే అబార్షన్ చేస్తున్నారనే ఆరోపణలున్న వారిని ఆధారాలతో పట్టుకుని, చట్టప్రకారం శిక్ష పడేలా చూడాలన్నారు. వైద్యాధికారులు, జిల్లాకమిటీతోను, ఇతరశాఖల అధికారులతో సమన్వ యం చేసుకుని చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఆడపిల్ల ప్రాముఖ్యత గురించి ప్రజలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శోభారాణి మాట్లాడుతూ లింగ నిర్ధారణ నివారణ చట్టం అమలుకు లీగల్ సర్వీసెస్ అథారిటీ అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి, గైనకాలజీ విభాగాధికారి డాక్టరు షంషాద్‌బేగం, పోలీస్‌శాఖ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్టీటీ హెల్త్ డైరెక్టరు డాక్టరు దుర్గేష్, రెడ్స్ భానుజా, డెమో త్యాగరాజు, గంగాధర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### స్వయం ఉపాధికి రుణాలు ఇవ్వండి

స్వయం ఉపాధికి సంబంధించిన పథకాలకు లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కలెక్టరు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ బీసీయాక్షన్ ప్లాన్ కింద స్వయం ఉపాధి పథకం ద్వారా జిల్లాకు 1728యూనిట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో 13 బ్యాంకుల పరిధిలో యూనిట్‌ల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలని సూచించారు. రూ.రెండు లక్షలు విలువ కలిగిన యూనిట్‌లు 1228ఉండగా, రూ. రెండు లక్షల నుంచి రూ. మూడు లక్షలు విలువ ఉన్న యూనిట్లు 368 ఉన్నాయ న్నారు. రూ. మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షలు విలువ చేసే యూనిట్‌లు 132 జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఆయా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 8నుంచి 16వరకు ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ అవుతుందని మీసేవ, సచివాలయాలలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టరు తెలిపారు.

### జిల్లాకు 72 జనరిక్ మందుల షాపులు

జిల్లాకు కొత్తగా 72 జనరిక్ మందుల షాపులు మంజూరైనట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఈబీసీ నిరుద్యోగ యువతకు ఈషాపులు కేటాయిస్తామన్నారు. ఈషాపు విలువ రూ.8లక్షలు ఉండగా అందులో రూ.4లక్షలు సబ్సిడీ పోగా బ్యాంకు రూ.4లక్షలు రుణం ఇస్తుందన్నారు. అర్హత కలిగిన బీసీ, ఈబీసీ యువత ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు కోరారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఎల్డీఎం నర్సింగరావు, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఫిషరీష్ డీడీ శ్రీనివాసనాయక్, డీసీసీటీ సీఈఓ సురేఖారాణి పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## పసి చేతులతో పాడు పనులు

- కళేకుర్తి పాఠశాల విద్యార్థులతో మరుగుదొడ్ల క్లీనింగ్



పాఠశాలలో మరుగుదొడ్లు కడుగుతున్న విద్యార్థులు

కణేకల్లు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్న ఫొటోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పసి పిల్లలతో గలీజు పనులు చేయించడం ఏంటని మండపడ్డారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పుష్పావతిను వివరణ కోరగా పాఠశాలలో మరుగుదొడ్లు కడుగుతున్న ఆయాకు నీళ్ల ఇచ్చేందుకు మాత్రమే విద్యార్థులు వెళ్లారన్నారు. పిల్లలతో మరుగుదొడ్లు క్లీన్ చేయించలేదని తెలిపారు.

## అణగదొక్కాలని చూస్తే సహించం

- చేనేతల సత్తా చూపుతాం: ఎమ్మెల్యే కందికుంట
- ఘనంగా చేనేత కులాల ఐక్యవేదిక సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ధర్మవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అణగదొక్కాలని చూస్తే సహించబోమనీ, చేనేత కులాల సత్తా ఏంటో చూపుతామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఉద్ఘాటించారు. స్థానిక శివానగర్‌లోని శివాలయం వద్ద పట్టణ చేనేత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సుకు ఎమ్మెల్యే కందికుంట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి చేనేత ప్రముఖురాలు జయశ్రీ అధ్యక్షత వహించారు. అంతకుముందు కదిరిగేటు వద్ద ఉన్న చేనేత విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి వెండిరథంపై శివాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ శివాలయంలో పూజలు నిర్వహించారు. సమావేశానికి రాయలసీమ జిల్లాలతోపాటు కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా భారీగా చేనేత నాయకులు హాజరయ్యారు. కందికుంట మాట్లాడుతూ.. 80వ దశకం నుంచి ముందు వరుసలో ఉన్న చేనేతలు నిస్వార్థంగా అందరినీ అందలమెక్కిస్తున్నారన్నారు. అలా అందలం ఎక్కిన వారే చేనేతలను పాతాళానికి తొక్కేస్తుండటం సహించరానిదన్నారు. చేనేతలను చైతన్యవంతులను చేసి, రాజకీయ సుస్థిరత స్థాపించాలన్నదే తమ అభిమతమన్నారు. ధర్మవరం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా మారిందంటే అందులో చేనేతలదే కీలకపాత్ర అన్నారు. నిస్వార్థంగా పేదలకు సేవ చేస్తూ నాయకత్వ లక్షణాలు పెంచుకుంటే పదవులు వెన్నంటే వస్తాయన్నారు. ధర్మవరంలో కౌన్సిలర్, చైర్మన్ పదవులతో మురిసిపోతుంటారన్నారు. ఉన్నత పదవులే లక్ష్యంగా పనిచేయాలని హితవు పలికారు. తనకు కదిరి నియోజకవర్గమే సర్వస్వమన్నారు. ధర్మవరం చేనేతల అభివృద్ధికి సహకారం అందిస్తానని ఆయన అన్నారు. అనంతరం కందికుంటను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత ప్రముఖులు బండారు ఆనందప్రసాద్, గిర్రాజు రవి, ప్రకాశ్, పోలా ప్రభాకర్, గుద్దిటి రాము, గడ్డం శ్రీనివాసులు, గడ్డం పార్థసారధి, పరిశే సుధాకర్, బీరే గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజాతీర్పుతో జగన్‌కు మైండ్ బ్లాంక్: మంత్రి సవిత




పెనుకొండ టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజలిచ్చిన 2024 ఎన్నికల తీర్పుతో జగన్మోహన్‌రెడ్డికి మైండ్‌బ్లాక్ అయి, చిన్నమెదడు పనిచేయలేదని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. లక్షల మంది తల్లులు, పిల్లలు, రైతులకు అన్యాయం తలపెడుతున్నారని జగన్మోహన్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా మాట్లాడటం సిగ్గుచేటని ఖండించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో శనివారం మంత్రి మట్లాడుతూ.. జగన్ సక్రమంగా సంక్షేమ పథకాలు అందించకపోవడంతోనే 11 ఎమ్మెల్యే సీట్లకు పడిపోయారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుసనీ, జగన్ పదేపదే గుర్తుచేయాల్సిన అవసరం లేదన్నారు. సమస్య ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలన్నారు. 'అప్పుడే రాష్ట్ర ప్రజలకు నీ అవినీతి తెలుస్తుందని జగన్‌పై మండిపడ్డారు. జగన్ గాలోడు కాబట్టే హామీలిచ్చి, అమలు చేయలేక హెలీకాప్టర్‌లో తప్పించుకుని తిరిగాడన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి, మొఖం చాటేశాడన్నారు. సంపూర్ణ మద్య నిషేధమని చెప్పి జనం చెవిలో పూలు పెట్టాడన్నారు. ఇచ్చిన వాటితోపాటు ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. గాడితప్పిన వ్యవస్థలను లైన్‌లో పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రేయింబవళ్లు పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇలాంటి గాలిమాటలు మాట్లాడవద్దని జగన్‌కు హితవు పలికారు.

## ప్రధాని రాష్ట్ర పర్యటనను నిరసిద్దాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రదాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా ఈనెల 7న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విభజన చట్టంలో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ ను స్థాపించాల్సి ఉండగా, ఇపుడు కడప ఉక్కు మా పరిశీలనలో లేదని చేతులెత్తే యడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకుండా మోసం చేసిన బీజేపీ ప్రస్తుతం తాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఆంధ్రా ఎంపీల మద్దతుతోనే అన్న విషయం మరువరాదన్నారు. తెలుగుదేశం, జనసేన మద్దతుతో మూడోసారి కేంద్రంలో అధికారంలో ఉండికూడా రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేయగలుగుతోందంటే అందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలే కారణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు సుమారు రెండేళ్లుగా ప్రజలు పోరాడుతున్న విశాఖపట్నానికి ప్రధాని రావడం ఆంధ్రులను అగౌరపరచడమే నన్నారు. రాష్ట్రంలోని ఓడరేవులు, రోడ్లు, రైల్వేలైన్లను ప్రభుత్వం అదానీ కంపెనీకి అప్పగిస్తోందని ఆరోపించారు. అందుకే ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను నిరసిస్తూ జిల్లాకేంద్రంలో ఈనెల 7న నిరసనలు చేపడతామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, సావిత్రి, శ్రీనివాసులు, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తిరాజు, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, రామాంజినేయులు, తరిమెల రాజు, వెంకటనారాయణ, నిర్మల, అచ్యుతప్రసాద్, మల్లికార్జున, మారుతీప్రసాద్, ముత్తుజా, ఓతూరు పరమేష్, కసాపురం రమేష్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా బాలవికాస్ సదస్సు


నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, జనవరి4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో బాలవికాస్ సదస్సును శనివారం అట్టహాసంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు. సదస్సును సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు మొదలయ్యాయి. పలువురు వక్తలు.. బాలవికాస్ విద్య ప్రాధాన్యతను వివరించారు. ఉత్తమ బాలవికాస్ గురువులను ఆర్‌జే రత్నాకర్‌తోపాటు ట్రస్టు సభ్యులు చక్రవర్తి, మినీష్‌పాండే మొమెంటోలతో సత్కరించారు. బాలవికాస్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. బాలవికాస్ చిన్నారులు నృత్యంతో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సదస్సులో 2,500 మంది బాలవికాస్ ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.


బాలవికాస్ గురువును సత్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్, చక్రవర్తి


ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

**బంగారం కొనబడును**



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 224869

**గాయత్రి జ్యోతిష్యం**

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926.

AJA-ATP

**WANTED**

Wanted Lady office Executive for our Anantapur office. Qua.Inter./Degree HM WATER COMPONENTS PVT LTD. Contact:8008552048.

AJA-ATP

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

## న్యూస్ బాక్స్

### రేపు పింఛన్ల పరిశీలన: కమిషనర్

అనంతపురం క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరపాలిక పరిధిలో డీఎంహెచ్ఓ పింఛను దారులకు (రూ.15వేలు) సంబంధించి సోమవారం పరిశీలించనున్నట్లు నగర కమిషనర్ రామలింగేశ్వర్ శనివారం ప్రకటనలో తెలిపారు. వెరిఫికేషన్, రీ అసెస్మెంట్ కోసం మెడికల్ టీం నగరంలోని సచివాలయాల వారీగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లతారన్నారు. లబ్ధిదారులు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటి వద్దే అందుబాటులో ఉండి మెడికల్ టీంకు సహకరించాలని, సంబంధిత డాక్యుమెంట్ల కాపీలను సమర్పించాలని ఆయన సూచించారు.

### రుద్రంపేట సర్పంచు చెక్ పవర్ రద్దు

అనంతపురం రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచాయతీ సర్పంచు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పంచాయతీలో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై స్థానికులు 2021లో లోకయుక్తాను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారులు విచారణ వివరాలను కలెక్టర్ ద్వారా లోకయుక్తకు నివేదించారు. ఈ క్రమంలోనే శనివారం కలెక్టర్ ఆదేశాలమేరకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ నాయుడు సదరు పంచాయితీ సర్పంచు చెక్ పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

గార్లదిన్నె, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూదేడు ఎస్సీ కాలనీలో రాజ్యాం గ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమి పూజ చేశారు. ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ చౌన్నేళ్ల తిరుపాల్, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లన్న, బూదేడు రామాంజి, జేఏసీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఉపాధి'లో అవినీతిపై చర్యలు తీసుకోండి

● జనసేన నాయకుల వినతి

నార్పల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నార్పల మేజర్‌పంచాయతీ కార్యాలయంలో అధికారులు నిర్వహించిన గ్రామసభలో ఈఓఆర్డీ శైలజా రాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామలకు వినతి పత్రం అందజేశారు. జనసేనమండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, నాయకులు తుపాకుల భాస్కర్, పొన్న తోటరామయ్య, శ్రీధర్‌బాబు, కుళ్లాయప్ప, నరేంద్రస్వామి, తదితరులుపాల్గొన్నారు.

### ఘనంగా బ్రెయిలీ జయంతి

రామగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి):లూయీస్ బ్రెయిలీ జయంతిని స్థానిక ఎమ్మార్సీలో, ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో శనివారం వేరువేరుగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా అంధుల లిపికోసం లూయిస్ బ్రెయిలీ చేసిన కృషిని గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎం ప్రసాద్, రామగిరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకులుఅశోక్, ఎమ్మార్సీ సిబ్బంది, ప్రతిభా సొసైటీ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

### 'సమాజంలో అగ్రశిఖరం బోధనారంగం'



ప్రొఫెసర్ లక్ష్మయ్యను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బోధనారంగానిది సమాజంలో అగ్రశిఖరమని ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య పేర్కొన్నారు. ఆయన ఇటీవల సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆయనను శనివారం ఎస్కేయూ భౌతిక శాస్త్ర విభాగంలో పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ పూర్వ విద్యార్థులు డాక్టర్ దస్తగిరి, సుప్రియ, నాగమ్మ, పావని, భాను, రేఖ, పెద్దిరెడ్డి, యుగంధర్, వన్నూర్ వలి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాబ్‌మేళాను ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి ఇంటర్వ్యూలను ప్రారంభించి మాట్లాడారు. కియతోపాటు పదుల సంఖ్యలో ఏర్పాటైన అనుబంధ సంస్థలు పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. అనంతరం కియ అనుబంధ సంస్థ సినోసిస్ ప్రతినిధులు విద్యార్థులకు రౌండ్లవారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ చూపిన 40మందిని ఉద్యోగాలకు ఎంపిచేశారు. రూ.2లక్షల చొప్పున వార్షికవేతనం చెల్లిస్తారని, నాలుగు నెలలకు ఒకసారి వేతన పెంపు ఉంటుందని సంస్థ ప్రతినిధులు నరేష్‌కుమార్, సుమన్ తెలిపారు.

### 'ఆ కళాశాలను మూసివేయాలి'

అనంతపురం సెంట్రల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రాణాలను బలిగొంటున్న నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలను మూసి వేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ మేరకు శనివారం ఏఐఎస్‌ఏ, పీడీఎస్‌యూ సంయుక్తాధ్వర్యంలో ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, నాయకులు వేమన, కిష్ట, బాలకృష్ణ, భీమేష్, బండారు శంకర్, నరేష్, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

అనంతపురం క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముండబండపల్లి సమీపంలోని కంపచెట్లలో శనివారం రాత్రి పేకాడుతున్న ఐదుగురిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ రాంబాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.12,300 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

### దాడిపై కేసు

అనంతపురం క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకంఠం సమీపంలోని ఖజానా జ్యువెలర్స్ పక్కన ఎలక్ట్రికల్ షాపు వద్ద జరిగిన గొడవపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన ప్రశాంతి చేసిన ఫిర్యాదు మేరకు జయప్రకాష్ నారాయణ, బోయ రాము, ప్రవీణ్, విజయ్, సాయిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

## శరవేగంగా రోడ్డు పనులు



తలుపూరు తారు రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

ఆత్మకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతపురం - కళ్యాణదుర్గం రోడ్డు నుంచి నూతనంగా తలుపూరు గ్రామానికి చేపట్టిన తారురోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి మండలంలో అతి వేగంగా పూర్తికానున్న తారురోడ్డ కావడంతో మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల ముందు ఇచ్చిన మాట మేరకు తారురోడ్డు పనులు శరవేగంగా జరుగుతుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోటి రూపాయలకు పైగా నిధులతో రో డ్డు నిర్మాణం చేపట్టారు. ఇక 15రోజుల్లో రోడ్డు ప్రారంభానికి సిద్ధమవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మం డలంలో ఎక్కడా రోడ్డు వేయలేదన్నారు. మండలంలో దశలవారీగా ప్రతి గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేగా ఉన్నా లేకున్నా.. ఈ ప్రాంతానికి సేవ చేస్తా

● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా ఉన్న లేకున్నా పరిటాల రవీంద్ర భార్యగా ఈ ప్రాంతానికి సేవ చేస్తానని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రామగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంత జిల్లాకు డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఓ వరంలాంటిదన్నారు. కరువు ప్రాంతంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతలో గతంలో చదువుకోవాలంటే సరైన పాఠశాలలు లేవన్నారు. అందుకే ఆ రోజుల్లో పరిటాల రవి పదో తరగతి వరకే చదువుకోవడంజరిగిందన్నారు. అందుకే ఆయన పేరూరులో గురుకుల పాఠశాల, రామగిరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను తెచ్చార న్నారు. ఆయన ఆశయం మేరకు ఇక్కడ తాను పదెకరాల స్థలాన్ని విరాళంగా అందజేసి, నసనకోటలో గురుకుల పాఠశాలను తీసుకొచ్చా నన్నారు. ముత్యాలమ్మ ఆలయ అధ్యక్షుడిగా ఉన్న కొండన్న ఆలయ కమిటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, వాటిని కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధాకర్‌యాదవ్ డ్రగ్స్ వద్దు బ్రో అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించి చర్చించారు. కళాశాలకు పలువురు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో విరాళాలు ప్రకటించారు. ఆర్‌కొత్తపల్లికి చెందిన పరమేశ్వర్ రెండు కంప్యూటర్లు, కలికివాండ్లపల్లి సంజీవరెడ్డి రూ.50వేలు, రామగిరికి చెందిన ఎస్ ఆంజనేయులు రూ.50వేలు, పేపర్ శీన రూ.25వేలు, గుర్రం శీనా రూ.15వేలు, పూజారి అక్కులప్ప రూ.10వేలు, గంగమ్మ పూజారి ప్రతాప్ రూ.5వేలు ప్రకటించారు. మాజీసర్పంచ్ కళాశాల ఆవరణంలో డ్రయాస్ నిర్మిస్తానని తెలిపారు. వారందరికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.



వేడుకలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

### ఎస్ఎస్‌బీఎన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనంతపురం సెంట్రల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా అధ్యక్షురాలు డాక్టర్ దేవరకొండ కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేరళ ఐపీఎస్ యాసిన్, ఎస్ఆర్ నాగభూషణం, రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.



ఓం సంగీత నృత్య కోలాట బృందంతో అతిథులు

### పశువుల సంతలో తెలుగు తమ్ముళ్ల వాగ్వాదం

అనంతపురంరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన పశువుల సంతలో తెలుగు తమ్ముళ్లు ఫిరోజ్, పావురాల శేఖర్, నాగభూషణం మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పశువుల సంతలో శనివారం గొర్రెలు, మేకలు, ఎద్దుల సంత జరుగుతోంది. ఈ క్రమంలో పశువులను లోడ్ చేసుకుని వెళ్లే వాహనదారుల నుంచి టీడీపీకి చెందిన ఫిరోజ్ అనే నాయకుడు వారం నుంచి వసూళ్లు ప్రారంభించినట్లు తెలుస్తోంది. శనివారం కూడా వసూళ్లు ప్రారంభించారు. ఈక్రమంలో స్థానిక వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, మరికొంత మంది అక్కడి వెళ్లారు. తమ వార్డు పరిధిలో ఎలా వసూలు చేస్తారంటూ వాదనకు దిగారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. స్థానికంగా ఉన్న వ్యక్తులు సర్దిచెప్పడంతో వాగ్వాదం సద్దుమనిగింది.

### పూర్వ విద్యార్థులే మణిహారాలు

● ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జి వీసీ

అనంతపురం సెంట్రల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూనివర్సిటీకి పూర్వ విద్యార్థులు మణిహారాలు అని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత అన్నారు. వర్సిటీ కామర్స్ విభాగం 1978-80 బ్యాచ్ ఎంకామ్ విద్యార్థుల ఆత్మీయ సమారోహాన్ని శనివారం నిర్వహించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఆంజనేయులు అధ్యక్షతన మహాత్మా జ్యోతిరావు పూలే ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సుకు ఇన్‌చార్జి వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్కేయూలో 45 ఏళ్ల క్రితం ఎంకామ్ చదివి, వివిధ రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వర్సిటీని సందర్శించడం, సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మాజీ ప్రొఫెసర్లు హంపన్న, పణీశ్వర్‌రాజు, సీఆర్ రెడ్డి, నాగరాజు నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహశర్మ, పూర్వ విద్యార్థులు మాజీ ఐఏఎస్, పత్తికొండ ఎమ్మెల్యే రామాంజినేయులు, జానకిరామ్, అశ్వత్థనారాయణ నాయక్, కళ్యాణి, గిరయ్య, నరసింహారెడ్డి, మధుసూదన్, ఖాజా సాహెబ్, పెద్దన్న, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిలో మానసిక విభాగం పరిశీలన

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో శనివారం మానసిక రోగుల చికిత్సా విభాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రత్యేకంగా మానసిక రోగులకు ఏర్పాటుచేసిన విభాగంలో ఎన్ని పడకలు ఉన్నాయి? ఎంతమంది రోగులు చికిత్స పొందుతున్నారు? రోగులు ఆరోగ్య పరిస్థితులు తదితర విషయాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆరా తీశారు. డాక్టర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తన బాగోగులు పట్టించుకునే వారు లేరని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ ఎస్ఐ రాంబాబు తెలిపిన మేరకు...కళ్యాణదుర్గం పట్టణంలో మల్లికార్జున, జానకి దంపతులు నివాసముండేవారు. కొన్నేళ్ల కిందట వారు విడిపోయారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రెండున్నరేళ్ల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. జానకి భర్తకు దూరమయ్యాక అనంతపురం రూరల్ మండలంలోని బీజేపీ కొట్టాలలో తన తల్లితో కలిసి ఉంటోంది. మూడేళ్ల కిందట తండ్రి వద్ద ఉన్న రెండో కొడుకు ఆచారి కృష్ణ(18)ను తన వద్దకు తెచ్చుకుంది. అతన్ని మబ్బుకొట్టాలలో ఉంచి అప్పుడప్పుడు చూడటానికి వెళ్లి వచ్చేది. ఆచారి కృష్ణ ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈక్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు దూరంగా ఉండటం, సమయానికి తన బాగోగులు చూసుకునేవారు లేక మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఇష్టపడి గణితం నేర్చుకోవాలి: డీఈఓ

అనంతపురం విద్య, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి గణితం నేర్చుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. గణితంలో పట్టు సాధిస్తే మిగతా ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. జిల్లా సైన్స్ సెంటర్‌లో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వి ద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు, గణిత శాస్త్ర ప్రాజెక్టుల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లా డారు. తర్వాత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. డీవైఈఓ శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రసాద్, డాక్టర్ కిరణ్, సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాలమురళీకృష్ణ, గణిత ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణస్వామి, గౌరవాధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి రవీంద్ర, ఇతర గణిత ఫోరం కార్యవర్గసభ్యులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేయండి'

రాప్తాడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, వారి కుటుంబ సభ్యుల గురించి అసభ్య పదజాలంతో దూషించాడన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ముత్యాలప్ప పాల్గొన్నారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఆత్మకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థులకు పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మోడల్‌టెస్ట్ పుస్తకాలను పంపిణీ చేశారు. వీటిని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ లింగన్న చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్ బాకు రమేష్, టీడీపీ నాయకులు చితంబరనాయుడు,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## లైనింగ్ పనులు ఆపకుంటే ఉద్యమిస్తాం

● సీపీఐ, రైతు సంఘం నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆప కుంటే... రైతులతో కలసి ఉద్యమిస్తామని సీపీఐ, రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్ఎన్ఎస్ఎస్‌ను ఎన్టీఆర్ ప్రారంభిస్తే, వైఎస్ఆర్ నిధులు కేటాయించి కాలువను త వ్వించారన్నారు. చంద్రబాబు నాయుడు కాలువ వెడల్పు చేయించి, సాగు, తాగునీటికి కృష్ణా జలాలను మళ్లించడంతో రాయలసీమ ప్రాంతానికి చాలా మంచి జరిగిందన్నారు. అయితే రెండో విడత పనుల్లో బాగంగా కాంక్రీట్ లైనింగ్ పనులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు. దీంతో నీరు భూమిలోకి ఇంకిపోవని, ఫలితంగా బోర్లు రీచార్జ్ కావన్నారు. కావున హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ కు లైనింగ్ పనులు చేపట్టకుండా కా లువను వెడల్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో రైతులు, సంఘాల నేతలు, రాజకీయ నాయకులు, ప్రజలతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లాకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నేతలు నరేంద్ర, విజయ్, రమేష్, చలపతి, వెంకటరాముడు, రెడ్డప్ప, నారాయణస్వామి, దుర్గాప్రసాద్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### కారు బోల్తా - ఒకరికి గాయాలు

కనగానపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం 44వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం నుంచి బెంగళూరు వెళుతున్న ఓ కారు ముక్తాపురం వద్దకు రాగానే అదుపుతప్పి పక్కనున్న గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జయింది. అందులో కారు డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. అతడు తీవ్రగాయాలతో బయడపడ్డాడు. కారు ముందరి టైరు పగిలి పోవడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. గాయపడ్డ డ్రైవరును అనంతపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



బోల్తాపడి నుజ్జునుజ్జయిన కారు

## అనంతకు చేరిన జ్యోతి యాత్ర



జ్యోతి యాత్రకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

అనంతపురం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హుబ్లీలోని సిద్ధరూడా మఠం వారు చేపట్టిన జ్యోతి యాత్ర శనివారం అనంతపురం చేరింది. బెంగళూరు నుంచి చిక్క బళాపూర్ వెళ్తున్న ఈ యాత్ర శనివారం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథం చిక్క బళాపూర్ బయలుదేరి వెళ్లింది. కార్యక్రమంలో ఆలయ అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, కేవీఎస్ చలపతిరెడ్డి, మఠం ఆనంద్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో ముందుకెళుతోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఎమ్మెల్యే శనివారం శింగనమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథ కాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియన్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు చాలామంది అర్థాకలితో చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. వారి ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ప్రణాళికతో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్నం భోజనం ప్రవేశపెట్టారన్నారు. అదేవిధంగా శింగనమల జూనియర్ కళాశాలలో సైన్సు గ్రూపులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ బోయ సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల చదువులపై ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున, తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మిలకుమారి, ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, నాయకులు దండు శ్రీనివాసులు, దేగల కృష్ణమూర్తి, శాలిని, బోయ సత్యనారాయణ, బోయ సురేష్, మాసూల చంద్ర, ఎం.ఆదినారాయణ, చితంబరిదొర, కుమ్మెత చంద్రాయుడు, పత్రా ఎర్రిస్వామి, అనిల్, గుర్రం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం.. విద్యార్థులకు వరం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కడియాల కొండన్న ప్రిన్సిపాల్ దేవదాసు

అనంతపురం అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం కరువు జిల్లాలోని పేద విద్యార్థులకు వరమని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న పేర్కొన్నారు. స్థానిక పాతూరు నెంబర్ -1 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కడియాల కొండన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి పథకాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు, హెడ్ మాస్టర్ బాషా, నాయకులు సాకే రామాంజినేయులు, విజయ్‌కుమార్, సుధాకర్, బాబాఫకృద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు : స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని టీడీపీ మండల నాయకులు హాజరై ఘనంగా ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం కళాశాల విద్యార్థులుకు మధ్యాహ్నభోజనం అందించడం ఎంతో సంతోషకరం అన్నారు. తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంఈఓ నరసింహారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు,టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, మాజీ కన్వీనర్ సూరి, నాయకులు కందుల ఓబులపతి, అక్కులన్న, ఆదెప్ప, ఉమాపతి పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో వినియోగంలోకి యంత్రాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో విలు వైన యంత్రాలను ఏర్పాటు చేసి, రోగులకు సేవలు అం దించడానికి అందు బాటు లోకి తెచ్చారు. రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కోట్ల విలువైన యంత్రాలు పెద్దాసుపత్రిలో మూలకు పడేశారనే విషయంపై 'భద్రంగా... మూలన..!' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావును అడగగా సంక్రాంతి పండుగ తర్వాత ఇన్‌స్టాల్ చేయిస్తామన్నారు. అయితే ఈ కథనంపై కలెక్టర్ వినోద్‌కుమార్‌తోపాటు రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. దీంతో ఆస్పత్రి అధికారులు వెంటనే టెక్నీషియన్లను పిలిపించి యంత్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పల్మనాలజీ డిపార్టుమెంట్‌లో బ్రాంకోస్కోప్ యంత్రాన్ని, జనరల్ మెడిసన్ విభాగంలో ఎండోస్కోప్ యంత్రాన్ని వినియోగంలోకి తెచ్చారు. ఇక ఆల్ట్రాసౌండుకు సంబంధించి రెండు యంత్రాలు ఉన్నాయని వీటిని రెండురోజుల్లో వినియోగంలోకి తెస్తామని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.



## న్యూస్ బాక్స్

### బ్రాహ్మణపల్లిలో నాకాబందీ

తాడిపత్రి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లిలో శనివారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లు, గడ్డివాముల్లో సోదాలు చేపట్టారు. సోదాల్లో హుస్సేనప్ప ఇంట్లో మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారించగా అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు తేలిందని సీఐ తెలిపారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్‌నేరాలు అధికమయ్యాయని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐలు ధరణీబాబు, కాటయ్య, సిబ్బంది ఉన్నారు.

**ఆరుగురి అరెస్టు**

బ్రాహ్మణపల్లికి ఆరుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. గతేడాది జూలైలో గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డిలతో పాటు మరికొంతమంది ఇంటి వద్ద గోడ విషయంలో కతాలప్పతో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో కతాలప్ప గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, అందుకు సంబంధించి శనివారం ఆరుగురిని అరెస్టు చేశామని సీఐ చెప్పారు.

### ఆంజనేయస్వామికి ప్రత్యేకపూజలు


ప్రత్యేక అలంకరణలో అపులాపురం ఆంజనేయస్వామి

రాయదుర్గం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్రవన్నూరు గ్రామ సమీపంలో గల అపులాపురం ఆంజనేయస్వామి ఆలయం, మల్లాపురం విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆయా ఆలయాలలో మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున దర్శించి తీర్థప్రసాదాలు పొందారు.

### కౌన్సిల్ సమావేశం

గుత్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బర్‌మియా సమక్షంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిలర్ వరలక్ష్మి మాట్లాడుతూ పన్నులు కట్టకపోతే పథకాలు వర్తించవంటూ ప్రజలకు భయపెట్టడం ఏమిటని అధికారులపై మండిపడ్డారు. దీంతో తాము ఎవరిని భయపెట్టడం లేదని, కట్టే వారితో పన్నులు కట్టించుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. తరచూ పైప్‌లైన్ మరమ్మతులంటూ లక్షలాది రూపాయలు వృథా చేయకుండా నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మరో కౌన్సిలర్ అరవింద్ అధికారులను కోరారు. కొళాయి కనెక్షన్ పేరట కొందరు రూ.2500కు బదులు రూ. 6వేలు వసూలు చేస్తున్నారని, ఎందుకు ఇలా చేస్తున్నారంటూ పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించగా.. విచారించి తగు చర్యలు తీసుకుంటామని డీఈ శేఖర్ తెలిపారు. ఇక పలు సమస్యలను కౌన్సిలర్లు అధికారులకు తెలిపి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లుటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ మనోహర్ సూచించారు. పట్టణంలోని 29వ వార్డులో శనివారం ఆయన సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యువత మద్యం, గంజాయికు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లకు ఇంటర్ లాకింగ్ తాళాలను వేయడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. ప్రజలకు ఏదైనా సమస్యలు వస్తే వెంటనే 100, 102 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ వార్డు ఇన్‌చార్జి అంజి, సచివాలయ సిబ్బంది సుధాకర్, ఆదినారాయణ, వన్నూరమ్మ పాల్గొన్నారు.

### మద్యం విక్రేత అరెస్టు

యాడికి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కుంటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని శనివారం అరెస్టు చేసి 15క్వార్టర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. కుంటలో శ్రీరంగ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

### ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి

తాడిపత్రి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతగారిపల్లి గ్రామ సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో వృద్ధురాలు షేక్ మాబున్ని (65) మృతిచెందినట్లు రూరల్ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. తాడిపత్రిలోని నందలపాడుకు చెందిన షేక్ మాబున్ని శనివారం కొంతమందితో కలిసి తాతగారిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలోకి కూలీపనులకు వెళ్లింది. అక్కడ పొలం పనులు చేస్తున్న షేక్ మాబున్నీని ట్రాక్టర్ డ్రైవర్ గమనించక వెనుకవైపు నుంచి ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త మదార్‌సాబ్‌తోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### రూ. లక్ష వితరణ

శెట్టూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మంపల్లిలో గల ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఓ భక్తుడు రూ. లక్ష రూపాయలను వితరణ చేశారు. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా రొప్పం గ్రామానికి చెందిన నాగరాజు అనే భక్తుడు లక్ష రూపాయల నగదును ఆలయ కమిటీ నిర్వాహకులకు శనివారం అందజేశారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాతకు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


రమాదేవి

గుత్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రమాదేవి జాతీయ స్థాయి తాగులాగుడు క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మీనాక్షి తెలిపారు. పామిడిలో టగ్‌ఆఫ్‌వార్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గత నెలలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారని, ఇందులో ఈ విద్యార్థిని పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 5నుంచి9వ తేదీ వరకు మహారాష్ట్రలోని పల్లర్‌లో జరిగే జాతీయ స్థాయి టగ్‌ఆఫ్‌వార్ క్రీడా పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు శనివారం అభినందించారు.


రాయదుర్గంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


కుందుర్పి జూనియర్ కళాశాలలో భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని


గుత్తిలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వెంకటశివుడుయాదవ్

# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

రాయదుర్గం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల , బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఆయన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం డొక్కాసీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉపాధి అవకాశాల కల్పనకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మెండుగా పరిశ్రమలు తెప్పించడానికి ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెనుకపడ్డ రాయదుర్గానికి కొత్త పరిశ్రమలు వస్తాయని, యువత వాటిని అందిపుచ్చుకునేలా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన సరస్వతి కళావేదికను కాలవ ప్రారంభించారు. రాయదుర్గం మున్సిపల్ చైర్మన్, ఆయా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బంది పడకూడదు: ఎమ్మెల్యే అమిలినేని**

కుందుర్పి: ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతోనే.. ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థుల ఆకలి తీర్చామన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పథకాన్ని రద్దు చేసి విద్యార్థుల కడుపున కొట్టిందని విమర్శించారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం మరలా ఈ పథకాన్ని పునరుద్ధరించిన తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థి చరణ్‌తేజ్ తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, తల్లి వికలాంగురాలు కావడంతో వచ్చే పింఛన్‌తో కుటుంబాన్ని నెట్టుకుంటూ వస్తోందని స్థానికులు ఎమ్మెల్యేకు తెలపడంతో.. స్పందించిన ఆయన ఆ విద్యార్థి ఉన్నత చదువులకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పది కంప్యూటర్లు సొంత ఖర్చులతో అందచేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, తహ సీల్దారు శ్రీనివాసులు, ఎంఈఓలు తిప్పేస్వామి, ఓబుళపతి, నాయకులు పాల్గొన్నారు.

**బాగా చదవాలి: టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు**

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు గుమ్మనూర్ ఈశ్వర్, గుమ్మనూరు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థినులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మీనాక్షి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, కళాశాల ప్రిన్సిపాల్ సాలాబాయి, కౌన్సిలర్లు మహాలక్ష్మి, కృపాకర్, టీడీపీ నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు, టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఏపీఐడీసీ ప్రభుత్వ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, ప్రిన్సిపాల్ మమత, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంఈఓలు ఈశ్వరయ్య, రమాదేవి, టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీలు సుంకరత్నమ్మ, నాగేశ్వరరావు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. తహశీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓలు లక్ష్మణ, భవానీశంకర్ హాజరై విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ప్రిన్సిపాల్ ఆంజనేయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఎంఈఓ మల్లికార్జున, ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, హెచ్ఎం రాజ్‌కుమార్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, సీనియర్ నాయకులు పయ్యావుల నాగరాజు, పయ్యావుల అనిల్, మహేంద్ర, లాలుస్వామి హాజరై పథకాన్ని ప్రారంభించారు. అధ్యాపకులు సుబ్బరాయుడు, హనుమంత నాయక్ పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ కాశప్ప ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ సుభద్ర ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంఈఓలు జయనాయక్, సత్యనారాయణ, ఆర్ఐ విజయ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ నాయక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, తహసీల్దార్ భాస్కర్, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకంను ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంఈవో మల్లారెడ్డి, ఎంపీపీ పెద్దన్న, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ప్రిన్సిపాల్ శేషావలి, హెచ్ఎం వెంకటప్రసాద్‌లు ప్రారంభించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

### నిష్పక్షపాతంగా సామాజిక తనిఖీ చేపట్టాలి

గుంతకల్లు టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం నిష్పక్షపాతంగా తనిఖీ చేయాలని సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24సంవత్సరానికి మండలంలో రూ. 10కోట్ల వ్యయంతో పనులు చేశారన్నారు. అయితే పనుల్లో జరిగిన అవకతవకలను బయటపెట్టాలన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాముురాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పశువుల షెడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి

కూడేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కింద మంజూరైన మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీం బాషా ఆదేశించారు. మండలంలోని కొర్రకోడు, జల్లిపల్లి, ఉదిరిపికొండ గ్రామాల్లో నిర్మాణంలో నున్న గోకులం షెడ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనుల్ని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఏపీఓ తులసీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వం: జడ్పీ సీఈఓ


రంగసముద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ

కణేకల్లు/గుమ్మఘట్ట, జనవరి4 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా తగినచర్యలు తీసుకుంటున్నట్లు జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్యపై స్థానికులు ఆయనకు విన్నవించారు. కెన్‌గుంటలో ఇంటింటికీ అనధికారికంగా కొళాయిలు వేసుకోవడం వల్ల పలు ప్రాంతాలకు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలిపారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యను రానివ్వమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణారెడ్డి, సర్పంచ్ వన్నూరమ్మ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ వన్నూరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలం రంగసముద్రం గ్రామంలో జడ్పీ సీఈఓ పర్యటించి అక్కడి ప్రజలతో సమస్యలపై ఆరా తీశారు. అలాగే సచివాలయ సిబ్బందితో సమీక్షించి మండలంలోని అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి అక్కడి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ రామకృష్ణుడు, పంచాయతీ విస్తరణాధికారి జయరాములు తదితరులు పాల్గొన్నారు.

**బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి**

రాయదుర్గం రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయాల ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాల్సి ఉంటుందని జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికృష్ణ, ఈఓపీఆర్డీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

### జనసేన ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి అరెస్టు

- రెండుగంటల అనంతరం విడుదల

తాడిపత్రి, జనవరి4(ఆంధ్రజ్యోతి): జనసేన తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డిని శనివారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఎన్నికల సమయంలో జరిగిన రాళ్లదాడుల్లో శ్రీకాంత్‌రెడ్డిపై కేసు ఉండడంతో గతంలో పలుమార్లు స్టేషన్‌కురావాలని సూచించాము, కానీ ఆయన రాకపోవడంతో శనివారం రెండు వాహనాల్లో స్థానిక సుంకులమ్మపాలెంలో ఉంటున్న ఆయన ఇంటివద్దకు వెళ్లి అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. అనంతరం రెండుగంటలపాటు విచారించి నోటీసు అందించి విడుదల చేశామన్నారు. అరెస్ట్‌చేస్తున్నారన్న సమాచారంతో జనసేన శ్రేణులు పెద్దఎత్తున శ్రీకాంత్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు.

### టీడీపీలోకి 10 కుటుంబాల చేరిక

- ఆహ్వానించిన ఎమ్మెల్యే అమిలినేని


టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లిలో వైసీపీకి చెందిన సుమారు 10 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం వారు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని మెచ్చి టీడీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను అరికడదాం

యాడికి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం మండలకేంద్రంలోని సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. ఇలాంటి వివాహాల వల్ల బాలికల జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదన్నారు. వాటి నివారణకు సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సదస్సులో ఈఓపీఆర్డీ శశికళ, ఎస్ఐ వెంకటరమణయ్య, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### నిధులు మంజూరు చేయండి

బొమ్మనహాళ్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లులో శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆ గ్రామ టీడీపీ నాయకులు మల్లన్న, లేపాక్షి కోరారు. వారు ఎంపీని అనంతపురంలో శనివారం కలిసి మాట్లాడారు. ఇందుకు అంబికా లక్ష్మీనారాయణ సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పెన్నానది నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 9 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు. శనివారం వేకువజామున పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

### రేషన్ బియ్యం పట్టివేత

డీ.హీరేహాళ్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఓ వాహనంలో తరలుతున్న రేషన్‌బియ్యాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి మండల కేంద్రం సమీపంలోని బళ్లారి - బెంగళూరు హైవేపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో బళ్లారి నుంచి బెంగళూరు వైపునకు ఒక ఐషర్ వాహనం బియ్యం లోడుతో వెళుతోంది. పోలీసులు తనిఖీ చేయడానికి ఆ వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా డ్రైవర్ నిలపకుండా దురుసుగా ముందుకు పోనిచ్చాడు. దీంతో ఎస్ఐ ఆ లారీని వెంబడించి జాజరకల్లు టోల్‌గేట్ సమీపంలో పట్టుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి పరిశీలించగా.. అందులో సుమారు 300లకుపైగా రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక నుంచి ప్రజాపంపిణీ కోసం ఆ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సంబంధితాధికారులు రికార్డులు సమర్పించడంతో పోలీసులు పరిశీలించి వాహనాన్ని విడుదల చేశారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బెళుగుప్ప, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లిలో శనివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని ఫ్రిడ్జ్, బీరువా, బియ్యం, రూ. 50 వేల నగదు, వంట సామగ్రి తదితరాలు పూర్తిగా కాలిపోయాయి. గొర్రెలను పోషించుకుంటూ జీవనం సాగించేవాడినని, గొర్రె పిల్లలు విక్రయించగా వచ్చిన డబ్బు బీరువాలో ఉంచామని, ప్రమాదంలో అన్నీ కాలిబూడిదయ్యాయని బాధితుడు కటువప్ప వాపోయారు. ప్రమాదం జరిగినప్పుడు ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. కాలనీవాసులు అప్రమత్తమై మంటలు ఆర్పారన్నారు. రూ. 2 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### చోళ సముద్రంలో రెవెన్యూ సదస్సు

కూడేరు, జనవరి 4: ఆంధ్రజ్యోతి: మండలంలోని చోళ సముద్రం గ్రామంలో శనివారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ.. గ్రామాల్లో భూ సమస్యలతో సమతమమవుతున్న రైతులకు రెవెన్యూ సదస్సులు చక్కటి పరిష్కార వేదికని తెలిపారు. భూ సమస్యలున్న రైతులు ఈ సదస్సులో అధికారులకు అర్జీలు ఇస్తే పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం పలువురు రైతులు 23 అర్జీలను అధికారులకు సమర్పించారు. ఉప సర్పంచు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు వడ్డే రాజు, మురళీ, చంద్రబాబు నాయుడు, నటరాజ్, మండల సర్వేయర్ అయేషా సిద్దిఖీ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సు పాల్గొన్న అధికారులు, సర్పంచ్

### భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ సదస్సులో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

డీ.హీరేహాళ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని గొడిశలపల్లి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా కాలవ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ పేదల భూములను కొల్లగొట్టే చర్యలో భాగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే ఒక నల్ల చట్టాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులకు ఊరట కలిగించారని చెప్పారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని, రైతులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ దాస్‌నాయక్, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, డీటీ బసవకుమార్, సర్వేయర్ రవితేజ, నాయకులు పాల్గొన్నారు.

**16 ఏళ్ల సమస్యను తీర్చిన కాలవ**

గొడిశలపల్లి గ్రామస్థులు గత 16 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఆ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారు. అలాగే అక్కడే నూతన బస్సును కూడా ప్రారంభించారు. ఇందుకు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

**రెవెన్యూ సదస్సులో 9 అర్జీలు**

ఉరవకొండ: పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సును శనివారం నిర్వహించారు. ఇందులో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ పాల్గొని మాట్లాడారు. భూవివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. అందుకే ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తెలిపారు. సదస్సులో రైతుల నుంచి 9అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. పంచాయతీ కార్యదర్శి గౌస్, సర్పంచ్ లలితమ్మ, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రామాంజనేయులు, వేల్పుల శ్రీనివాసులు, ప్యారంకేశవానంద పాల్గొన్నారు.

### గుత్తిడీజిల్ షెడ్‌లో డీఆర్‌ఎం పర్యటన

గుత్తి,జనవరి4(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్‌గా నూతనగా బాధ్యతలను చేపట్టిన చంద్రశేఖర్‌గుప్తా మొదటి సారిగా శనివారం గుత్తి డీజిల్‌షెడ్‌లో పర్యటించారు. ముందుగా స్థానిక రైల్వే స్టేషన్‌లో సీనియర్ డీఎంఈ ప్రమోద్ ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన రైల్వేస్టేషన్‌ను, సీఅండ్‌డబ్ల్యూ డిపోను తనిఖీ చేశారు. అక్కడ అధికారులతో చర్చించారు. సీఅండ్‌డబ్ల్యూ సీనియర్ డీఎంఈ ముఖేష్, డీఎంఈ వికాస్, స్టేషన్‌మేనేజరు సురేష్‌బాబు, క్రూకంట్రోలర్ లాబీ ఇన్చార్జి బాలస్వామి, ఏడీఈఎన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

యాడికి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మాజీపేటకు చెందిన రామాంజనేయులు అదృశ్యమైనట్లు అతడి భార్య గౌతమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. గత డిసెంబరు 27వ తేదీన రామాంజనేయులు భార్యతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం రాయలచెరువుకు వచ్చాడు. పని అనంతరం తర్వాత నీవు ఇంటికి వెళ్లు.. నేను తర్వాత వస్తానని భార్యను ఇంటికి పంపించాడు. అప్పుడు వెళ్లిన అతను తర్వాత తిరిగి రాలేదు. దీంతో భార్య పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### మండల సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు: ఆర్డీఓ


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ

బొమ్మనహాళ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమంగా కర్ణాటక రాష్ట్రానికి తరలిపోకుండా సరిహద్దులో చెక్‌పోస్టు లు ఏర్పాటు చేస్తున్నట్లు కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత్‌బాబు తెలిపారు. మండల సరిహద్దులోని చెక్‌పోస్టును శనివారం ఆయన తహసీల్దార్ మునివేలుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని వేదావతి హగరి నుంచి ఇసుక అక్రమంగా రవాణ చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. బొల్లనగుడ్డం, సిద్దరాంపురం, బొమ్మనహాళ్ శివార్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. అక్రమంగా ఇసుకను తరలించినా, చెరువులు, వాగుల్లో తవ్వినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.